సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



అరుదైన గౌరవం

నాయీ బ్రాహ్మణులకు దేశ చరిత్రలోనే అరుదైన గౌరవం దక్కిందని జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు రామారావు, మూగండి సూర్య నారాయణలు హర్షం వ్యక్తం చేశారు. - 8లో



కొరమలో మహిళ మృత అవశేషాలు

భామిని మండలం కొరమలో బయటపడిన గుర్తుతెలియని మహిళ మృత అవశేషాలు స్థానికులను భయాందోళనకు గురిచేశాయి. - 8లో

నేడు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

పార్వతీపురం: జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్‌డీవీ. రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డీవీఎంఎం పాఠశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు ముగింపు కార్యక్రమం జరుగుతుందని, అందులో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ పాల్గొంటారని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కురుపాం జూనియర్ జడ్జిగా రోహిణీరావు

విజయనగరం లీగల్: పార్వతీపురంమన్యం జిల్లా కురుపాం జూనియర్ సివిల్ జడ్జిగా ఎం. రోహిణీరావు నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. రోహిణీరావు స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ. ఇటీవల జరిగిన జూనియర్ సివిల్‌జడ్జి పోస్టుల భర్తీలో ఆమె ఎంపికయ్యారు.

శంబర పోలమాంబ హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి హుండీల ఆదాయాన్ని ఈఓ వి.రాధాకృష్ణ, సాలూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎం.ప్రసాదరావు, ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు సమక్షంలో గురువారం లెక్కించారు. పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి ఆలయాల్లో మూడు, నాల్గవ జాతరలో భక్తులు హుండీలలో సమర్పించుకున్న కానుకల రూపంలో రూ.11,93,917 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు కమిటీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సుల పరిశీలన



బ్యాలెట్ బాక్సుల భద్రతను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: శాసన మండలి ఎన్నికలకు వినియోగించేందుకు కలెక్టర్ కార్యాలయంలో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను కలెక్టర్ నిషాంత్ కుమార్ గురువారం పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులను తరలించే బస్సులను ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిలిపేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో జల్లేపల్లి వెంకటరావును ఆదేశించారు. ఎన్నికల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచే ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఆర్టీసీ ఈడీ దృష్టికి రోడ్డు సమస్య

- ఎమ్మెల్సీ విక్రాంత్



ఆర్టీసీ ఈడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పక్క నుంచి ఆంజనేయనగర్ కాలనీకి వెళ్లే రోడ్డు సమస్యను విజయనగరం జోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కనే ఉన్న కాలనీలకు ఆర్టీసీ స్థలం గుండా రోడ్డు వేయాల్సి ఉందన్నారు. కాలనీవాసుల వినతిమేరకు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పాఠశాల యాజమాన్యం

విజయనగరం ఫూల్‌బాగ్: స్థానిక వీటీఅగ్రహారం ఉన్నత పాఠశాలలో అండర్-14,17, బాలబాలిక సెపక్‌తక్రా జిల్లాజట్ల ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడే జిల్లా జట్లకు ఎంపిక చేశారు. వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపిక పోటీలను జీజీఎఫ్ సెక్రటరీ ఎల్.వి.రమణ, హెచ్ఎం రాజేశ్వరరావు ప్రారంభించారు. పీడీలు ధర్మారావు, కృష్ణ, ఆనంద్, చంటి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.



మహాశివరాత్రి, మాసశివరాత్రి, శనిత్రయోదశి ఒకే రోజు రావడం.. 144 సంవత్సరాల తర్వాత వచ్చిన పర్వదినం వేళ.. ముక్కంటీశ్వరుని పూజలకు జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. పచ్చని తోరణాలు.. విద్యుత్ దీపాల అలంకరణ.. క్యూకాంప్లెక్స్‌ల ఏర్పాట్ల పనులు దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో చకచకా సాగుతున్నాయి. భక్తుల రాకపోకలకు అనువుగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తుండగా, శాంతిభద్రతల పరిరక్షణ విధులకు పోలీస్ శాఖ సన్నద్ధమవుతోంది.



అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర ఆలయం

మహాశివరాత్రి పూజలకు
శైవక్షేత్రాల ముస్తాబు

- ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- భక్తుల రాకపోకలకు అనువుగా బస్సు సర్వీసులు
- ఎస్పీ ఆధ్వర్యంలో గట్టిపోలీస్ బందోబస్తు
- క్యూకాంప్లెక్స్‌ల ఏర్పాటు
- భక్తులకు సేవలందించేందుకు సిద్ధమవుతున్న స్వచ్ఛంద సంస్థలు

నదీ సంగమంలో గుంప సోమేశ్వరుడు

కొమరాడ: నాగవళి, జంఝావతి నదుల సంగమ ప్రదేశం గుంప వద్ద వెలసిన సోమేశ్వరుడిని దర్శించుకుంటే కాశీయాత్ర చేసినంత పుణ్యం సిద్ధిస్తుందన్నది భక్తుల నమ్మకం. కొమరాడ మండలం కోటపాం పంచాయతీ దేవునిగుంపలో ఉన్న ఈ ఆలయానికి ఘన చరిత్ర ఉంది. ద్వాపరయుగంలో బలరాముడు గోహత్య దోష నివారణ కోసం శివుని ప్రార్థించగా, నదీతీరాన ఐదు శివలింగాలు ప్రతిష్ఠించాలని హితబోధ చేశారట. బలరాముడు తన నాగళితో దున్నడంతో నాగావళి నది ఏర్పడినట్టు, మార్గంమధ్యలో అటంకాలు ఎదురైన చోట శివలింగాలను ప్రతిష్ఠంచినట్టు భక్తుల నమ్మకం. అలా నది వెంబడి ఒడిశా రాష్ట్రంలోని పాయకపాడులో భీమేశ్వరుడు, దేవునిగుంప వద్ద సోమేశ్వరుడు, వంగర మండలం సంగాం వద్ద సంగమేశ్వరుడు, శ్రీకాకుళం వద్ద రుద్రకోటీశ్వరుడు, కళ్లేపల్లి వద్ద శ్రీనాగేశ్వరునిగా పూజులు అందుకుంటున్నాడు. మహాశివరాత్రి పర్వదినాన స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం కోటిపాం సర్పంచ్ సుగుణ, ఈఓ ప్రసాదరావు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



నాగవళి, జంఝావతి నదుల మధ్య ఉన్న సోమేశ్వర ఆలయం



గళావల్లిలోని కామలింగేశ్వర ఆలయం

కామలింగేశ్వరాలయానికి శతాబ్దాల చరిత

బలిజిపేట: గలావల్లిలో కామలింగేశ్వర ఆలయం 11వ శతాబ్దం నాటిది. తూర్పు గాంగరాజులలో అగ్రగణ్యుడైన అనంతవర్మ చోడగంగ (కీ.శ.1176-1174), కస్తూరికామోదినుల కుమారుడైన కామార్థవుని (కీ.శ.1147-1156) పేరున ఈ ఆలయం నిర్మించినట్టు శాసనాలు చెబుతున్నాయి. తూర్పు గండేశ్వరునిగా వ్యవహరింపబడిన స్వామి కామార్ణనదేవరగా మారినట్టు అక్కడ లభ్యమైన శాసనం తెలియజేస్తుంది. అపురూప శిల్పసంపద ఆలయం సొంతం. శివరాత్రి సందరభంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఆలయంలో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు.

కొండ గుహలో కొలువైన కాశీవిశ్వేశ్వరుడు

పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రాని 4 కిలోమీటర్ల దూరంలో అడ్డాపుశీలలో కొలువైన కాశీవిశ్వేశ్వరుడి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో 47 అడుగుల వెడల్పు, 42 అడుగుల ఎత్తు, 24 అడుగుల కైవారం గల అతి పెద్ద నంది విగ్రహాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్మించింది. సుమారు 500 ఏళ్ల కిందట జైపూర్ మహారాజులు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం ప్రాంగణంలో మరో 12 ఉప ఆలయాలు ఉన్నాయి. శివరాత్రి పర్వదినాన ఈ ఆలయాన్ని వేలాది మంది భక్తులు దర్శిస్తారు. దీనికి అనుగుణంగా భారికేడ్లు ఏర్పాటు చేశారు.



అడ్డాపుశీలలో శివుని విగ్రహం



మంచాడవలస గుహలోని శివలింగం (ఫైల్)



పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి (ఫైల్)

ఒక్కో ఆలయానికి ఒక్కో విశిష్టత

సాలూరు: శైవ క్షేత్రాలు శివరాత్రి శోభను సంతరించుకున్నాయి. సాలూరు పట్టణంలో 400 ఏళ్ల కిందట వెలసిన పంచముఖాలతో కూడిన శివలింగం నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయంలోని శివలింగం రూపాన్ని పోలి ఉంటుంది. ఆలయ దక్షిణ, తూర్పు దిక్కుల గుండా వేగావతి నది ప్రవహించడం ఈ ఆలయానికి మరో విశిష్టత.

పాచిపెంట మండలం మంచాడవలస గ్రామ సమీపంలో గుహలో గోకర్ణేశ్వర స్వామి దర్శనమిస్తారు. కొండపై ఉన్న ఈ గుహలోకి వెళ్లేముందు 18 అడుగుల నంది విగ్రహంతో పాటు 28 అడుగుల శివుని విగ్రహం ఉంటుంది. గుహ ప్రవేశమార్గం పెద్ద ఏనుగు తల ఆకారంలో ఉంటుంది. సాలూరు బస్‌స్టాండ్ నుంచి పాచిపెంట వెళ్లే బస్సు లేదా ఆటోపై ఆలయం వద్దకు చేరుకోవచ్చు.

- పాచిపెంట మండలంలోని పారమ్మ కొండపై 36 చేతులలో ఆయుధాలు ధరించి శిరస్సుపై శివుడిని కలిగి ప్రత్యేకంగా ఉండే అమ్మవారి విగ్రహాన్ని 2,400 ఏళ్ల కిందట ప్రతిష్ఠించినట్టు భక్తుల కథనం. ఇక్కడ గుహలోనే పాండవులు వనవాసం ఉండేవారని, ఆ సమయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి మహాశివునికి ప్రత్యేక పూజలు చేశారని విశ్వసిస్తారు. ఈ కొండపై వెలసిన స్వయంభు శివలింగం ఉండగా ఆ సమీపంలో రాష్ట్రంలో అతి పెద్దశ్రీ చక్రం ప్రతిష్ఠించబడింది. మహాశివరాత్రి పర్వదినాన ఇక్కడ అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో 35 బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డీఎమ్ భాస్కరరెడ్డి తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయండి

వీరఘట్టం: ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని వీరఘట్టం మండలం చలివేంద్రి గ్రామ రైతులు కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు విన్నవించారు. గ్రామాన్ని గురువారం సందర్శించిన కలెక్టర్ దృష్టికి ధాన్యం కొనుగోలు సమస్యను తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ 30 వేల టన్నుల మిగులు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని తెలిపారు. కొందరు రైతులు కలెక్టర్ సమాధానం వినిపించుకోకుండా ధాన్యం కొనుగోలు చేయాలంటూ నినదించారు. విధులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్రామంలో మిగులు ధాన్యం నిల్వలను లెక్కించి కొనుగోలు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు.



చలివేంద్రిలో పర్యటిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

14 మందిపై కేసు నమోదు

చలివేంద్రి గ్రామ వీఆర్వో పి.రఘునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన 14 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. చలివేంద్రి గ్రామానికి వచ్చిన కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను వీరు అడ్డుకొని, విధులకు ఆటంకం కలిగించారని, కలెక్టర్ ఆదేశాల మేరకు వీఆర్వో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెయ్యిమంది దంపతులకు షష్టిపూర్తి



షష్టిపూర్తి మహోత్సవంలో పాల్గొన్న దంపతులు

కొత్తవలస రూరల్: కొత్తవలస మండలం మంగళపాలెంలోని సీతారామచంద్రస్వామి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్టు, ఆలయ కమిటీ, గౌరీసేవా సంఘం ఆధ్వర్యంలో సీతారాములు, వెంకటేశ్వర కల్యాణోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. అయోధ్య రామమందిరం అర్చకుడు సత్యేంద్రకుమార్‌దాస్ పర్యవేక్షణలో 30 మంది వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామివార్ల కల్యాణోత్సవాన్ని జరిపారు. వేలాది మంది భక్తులు స్వామివారికి, అమ్మవార్లకు సారెను సమర్పించారు. అనంతరం గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు చేతుల మీదుగా 1000 మంది దంపతులకు శాస్త్రోక్తంగా షష్టియద్ధి మహోత్సవాలను నిర్వహించారు. 10వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు.

తొలిరోజు ఒకటి

- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థి నామినేషన్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పీడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభ నామినేషన్ దాఖలు చేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం తన నామినేషన్ పత్రాలను(రెండు సెట్లు) ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జునకు అందజేశారు. అంతకుముందు ఆమె డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా రమాప్రభ మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యావంతుల వాణిని చట్టసభల్లో సమర్థవంతంగా వినిపించాలంటే తనను గెలిపించాలన్నారు. రాష్ట్ర విభజన చట్టం అమలు చేయకుండా కేంద్రం ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందన్నారు. ఉత్తరాంధ్రకు చట్ట ప్రకారం ప్రత్యేక నిధులు రావడం లేదని, తొమ్మిదేళ్లయినా రైల్వే జోన్‌కు అతీగతి లేదన్నారు. పెట్రో, గిరిజన యూనివర్సిటీ నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదన్నారు. తొలుత ఆమె అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈఎంయూ రైలు పునరుద్ధరణ

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర జిల్లాల ప్రయాణికుల సౌకర్యార్థం పలాస-విశాఖపట్టణం ఈఎంయూ పాసింజర్ రైలు సర్వీసులు పునరుద్ధరించినట్టు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. చీపురుపల్లిలోని తన నివాసంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. కరోనా కారణంగా పలాస-విశాఖపట్టణం ఈఎంయూ పాసింజర్ రైలు సర్వీసులు నిలిచిపోయిన సంగతి తెలిసిందేనన్నారు. ఈఎంయూ నిలిపివేతతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను రైల్వే శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. రైలు పునరుద్ధరణతో ప్రయాణికుల సమస్య పరిష్కారమైందని చెప్పారు.

లక్ష్యం మేరకు పనులు

పార్వతీపురం: లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్‌రెడ్డి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షిస్తూ నిర్మాణ పనులకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. రీ-సర్వే, భూసేకరణ, మ్యుటేషన్, వ్యవసాయ రంగానికి సంబంధించి రబీ కాలానికి ఇ-క్రాప్ బుకింగ్, బిందుసేద్యం, పాలవెల్లువ, చేయూత, గృహ నిర్మాణ పథక లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు.

కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుప తయ్య, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఎ.ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సాగు పద్ధతులపై శిక్షణ

సీతంపేట: శాస్త్రీయ సాగు పద్ధతులపై సీతంపేట వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పాలకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని వివిధ మండాలల్లో పండించే పంటలు, వాటి స్థితిగతులపై చర్చించారు. చీడపీడల సమస్యల నివారణా చర్యలపై పరస్పర చర్చలు జరిపారు. వివిధ వ్యవసాయ పంటల్లో ఆచరించాల్సిన శాస్త్రీయ సాగుపద్ధతులను రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చే పంటలను, నూతన వంగడాల పరిశోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త పి.సీతారాం, ఎస్.లక్ష్మీనారాయణ, రస్తాకుంటుబాయి శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, కేవీకే శాస్త్రవేత్త పి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



పంటలపై చర్చిస్తున్న శాస్త్రవేత్తలు

వంగరలో ఏనుగుల గుంపు

వంగర: ఏనుగుల గుంపు వంగర మండలంలోకి ప్రవేశించాయి. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురం మీదుగా వంగర మండలంలోని కొప్పర-కొండచాకరాపల్లి గ్రామాల సమీపంలో సువర్ణముఖి నది దాటుకొని లక్ష్మీపేట, కొట్టిశ గ్రామాల పొలిమేరకు చేరుకున్నాయి. లక్ష్మీపేటలో గంట్యాడ కృష్ణమూర్తి, గంట్యాడ ఆదినారాయణలకు చెందిన 50 బస్తాల ధాన్యంను ధ్వంసం చేశాయి. అనంతరం మద్దివలస గ్రామం మీదుగా తలగాం వద్ద ఓ రైస్‌మిల్లు వద్ద తిష్టవేసిన ఏనుగులు పంటపొలాల్లోకి చేరాయి. తహసీల్దార్ డి.ఐజాక్ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. విజయనగరం అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జె.సుధీర్, కేవీఎస్‌రాజు, బీట్ ఆఫీసర్ కళ్రిస్వప్న, ఎస్.కిరణ్, వంగర పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ట్రాన్స్‌కో ఏఈ కె.వినయ్‌కుమార్ ఎం.సీతారాంపురం ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.



తలగాం వద్ద సంచరిస్తున్న ఏనుగులు



లక్ష్మీపేటలో ఏనుగులు ధ్వంసం చేసిన ధాన్యం

క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన సీఎం కప్ కరాటే చాంపియన్ షిప్‌లో విజయనగరంలోని శ్రీ గురుదత్త పాఠశాలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు విశాఖలోని స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఇ.హేమంత్, ఎస్.జితేంద్ర, బి.శ్రీకర్‌లు కాంస్య పతకాలు దక్కించుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పద్మ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం ఆమె సహ ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

పరుగు వీరుడు

- మెట్టవలస యువకుడి ప్రతిభ



సాధించిన పతకాలతో బొబ్బిలి సతీష్

బొబ్బిలి రూరల్: ఖరగ్‌పూర్ ఐఐటీ క్రీడామైదానంలో ఈనెల 10నుంచి 12వరకు జరిగిన 42వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో మెట్టవలసకు చెందిన బొబ్బిలి సతీష్ సత్తా చాటి పలు పతకాలు సాధించాడు. 30ప్లస్‌లో 100మీటర్ల పరుగుపందెంలో మూడోస్థానంతో కాంస్యపతకం, 200మీటర్లలో ప్రథమస్థానంతో బంగారుపతకం, 400మీటర్లలో రెండోస్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. అలాగే లాంగ్‌జంప్‌లో మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించాడు. పలు పతకాలు సాధించిన బొబ్బిలి సతీష్‌ను మెట్టవలసలో, బొబ్బిలిలో పలువురు ప్రత్యేకంగా గురువారం అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు ఆర్టీసీ బస్ డిపోలకు హెచ్ఎస్‌డీ ఆయిల్ సరఫరా చేసేందుకు ఆసక్తి గల జిల్లాలోని హెచ్ఎస్‌డీ ఆయిల్ బంక్ యజమానుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ దరఖాస్తులను ఈ నెల 14 నుంచి 23 వరకూ పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపో మేనేజర్ల కార్యాలయాల్లో లభిస్తాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫామ్స్‌ను 25వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోగా జిల్లా ప్రజారవాణా అధికారి, పార్వతీపురం మన్యం కార్యాలయంలో సమర్పించాలన్నారు. 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా ప్రజారవాణా అధికారి, పార్వతీపురం మన్యం కార్యాలయంలో టెండర్లు తెరుస్తారని పేర్కొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామం శివారులో సరుగుడు తోటల్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై ఎ.ముకుందరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.90,190 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఎల్లమాంబ జాతరకు సర్వం సిద్ధం



అమ్మవారి జాతర మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు



ఎల్లమాంబ అమ్మవారు

విజయనగరం టౌన్: భక్తుల కోర్కెలు తీర్చే సిరులతల్లి ఎల్లమాంబ సిరిమానోత్సవానికి ఆలయ కమిటీ ప్రతినిధులు రంగం సిద్ధం చేశారు. మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల ఎదురుగా ఉన్న ఎల్లమాంబ అమ్మవారు జాతర మహోత్సవాల కరపత్రాలను గురువారంరాత్రి ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26న ఆదివారం చండీహోమం, 27న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 28న మంగళవారం సాయంత్రం ఆలయ ఆవరణలో సిరిమాను మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు అగ్రపు సన్యాసిరాజు, చందక అప్పారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు బంటుపల్లి వెంకటరావు, సోము రామకోటేశ్వరరావు, సత్తిబాబు, వాలి,ప్రసాద్, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన గౌరవం

- నాయీ బ్రాహ్మణుల హర్షం
- జగనన్నకు రుణపడి ఉంటామంటూ కృతజ్ఞతలు
- ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు, కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నాయీ బ్రాహ్మణులకు దేశ చరిత్రలోనే అరుదైన గౌరవం దక్కిందని జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రామేశ్వరపు రామారావు, మూగండి సూర్యనారాయణలు హర్షం వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించి, ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయడంతో నాయీ బ్రాహ్మణ వర్గం నుంచి హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. ఈ మేరకు గురువారం జిల్లా నాయి బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జై జగన్, జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, ముఖ్యమంత్రి జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికే చెల్లిందన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తాం

నాయీ బ్రాహ్మణులంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికి రానున్న ఎన్నికలలో మద్దతుగా నిలిచి, వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మూగండి రమణమ్మ, నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కురువాడ సూరిబాబు, దిమిలి పైడిరాజు, ఉప్పిడి సత్యనారాయణ, బందారు శ్రీను, యామవరపు సత్య, గూడపోలు ఎల్లారావు, కాదులూరి సూరిబాబు, మూగంటి సీతారాం, ఆతం రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఫైలేరియా స్టేట్ కన్సల్టెంట్, జిల్లా మలేరియా ఆఫీసర్

రామభద్రపురం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఫైలేరియా స్టేట్ కన్సల్టెంట్ ఎం.లక్ష్మణరావు, జిల్లా మలేరియా ఆఫీసర్ ఎం.తులసి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ, కొట్టక్కిలో బోదకాలు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం వారు పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బోదకాలు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఈ నెల 10వ తేదీ నుంచి బోదకాలు వ్యాధి నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నామని, ఇప్పటి వరకు జిల్లాలో 87 శాతం మందికి పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు. ఫైలేరియా వ్యాధి సోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. బోదకాలు వ్యాధి గ్రస్తులు ఉండే ప్రాంతాలలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ముందు మురుగు కాలువలు ఉంటే వాటిలో దోమలు చేరే ప్రమాదం ఉందని, మురుగు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో స్టేట్ కన్సల్టెంట్ జి సతీష్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, ఏఎల్‌జి శిరీష, సీహెచ్‌వో చిన్నికృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.

జాతీయ సమగ్రత శిబిరానికి ఎంఆర్ విద్యార్థి ఎంపిక



అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విజయనగరం అర్బన్: పంజాబ్‌లోని పాటియాలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న జాతీయ సమగ్రత శిబిరానికి పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ వసంత సాయికృష్ణ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 10 మంది వలంటీర్లలో విజయనగరం జిల్లా నుంచి తమ విద్యార్థి ఉన్నాడని తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో రాష్ట్ర విశిష్టతను తెలిపే సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ విద్యార్థి పాల్గొంటాడని పేర్కొన్నారు. ఎంపికైన వలంటీర్‌ను ప్రిన్సిపాల్ సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు జి.చంద్రశేఖర్, ఎం.శ్రీకాంత్, సీహెచ్.చిన్నంనాయుడు, డాక్టర్ పీఎస్‌బీ శర్మ, కన్వీనర్లు డి.సన్యాసిరావు, ఎస్.నవీన్‌కుమార్, ఎస్‌వీరమణ తదితరులు అభినందించారు.

ఎనిమిది ఎకరాల చెరకుపంట దగ్ధం



కాలిపోయిన చెరకుగడలు చూపిస్తున్న రైతు

సంతకవిటి: మండలంలోని బూరాడపేట గ్రామ పంటపొలాల్లో జరిగిన అగ్నిప్రమాదంలో రైతులకు చెందిన 8 ఎకరాల చెరకు పంట అగ్నికి ఆహుతైంది. బుధవారం రాత్రి ఈ ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన కెంబూరు కృష్ణ, తాడేల వాసు, కెంబూరు రామారావు, కెంబూరు హరి, లోలుగు అక్కలనాయుడు, తాడేల శంకరరావు, బూరాడ విష్ణు, బూరాడ రంగ, మీసాల కృష్ణ, సీపాన శ్రీరాములు, మీసాల ఆదినారాయణ లకు చెందిన చెరకు పంట పూర్తిగా కాలిపోయింది. రూ. 7.50 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించిందని బాధితులు వాపోతున్నారు. స్థానిక రైతులు ప్రమాదాన్ని గుర్తించి, పంటపొలాల్లోని చిన్నచిన్నకాలువల్లో ఉన్న నీటిని ఆయిల్ ఇంజిన్ల సాయంతో తోడి మంటలు అదుపుచేశారు. తహసీల్దార్ ఎ.సులోచనారాణి రెవెన్యూ సిబ్బంది ద్వారా పంట నష్టం అంచనా రూపొందిస్తున్నారు.

బ్యాంకు ఖాతాలో డబ్బులు మాయం

చీపురుపల్లి: తన ప్రమేయం లేకుండా బ్యాంకు ఖాతాలో డబ్బులు ఎలా మాయమవుతున్నాయో తెలియడం లేదని చీపురుపల్లి పట్టణానికి చెందిన ఎం.వెంకటరావు గురువారం విలేకరుల ఎదుట వాపోయాడు. ఈ మేరకు వెంకటరావు మాట్లాడుతూ పట్టణంలోని కెనరా బ్యాంక్‌లో తనకు 6181101003731 నంబర్‌తో సేవింగ్స్ ఖాతా ఉందని, ఆ ఖాతా నుంచి తనకు తెలియకుండానే ఫిబ్రవరి 7న రూ.3,350, 15న రూ.10 వేలు మాయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు. తన ప్రమేయం లేకుండా ఖాతాలో డబ్బులు ఎలా మాయమైపోతున్నాయో తేల్చాలని బ్యాంకు మేనేజర్, పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఈ విషయం తేల్చాలని కోరాడు.

క్రీడాకారులకు ఎంపీ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అభినందించారు. ఇంటర్ యూనివర్సిటీ, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కొండవెలగాడకు చెందిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను గురువారం చీపురుపల్లిలో గల తన నివాసంలో అభినందించారు. జనవరి 27 నుంచి 30 వరకు కోల్‌కత్తాలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఎస్.పల్లవి బంగారు పతకం సాధించింది. అలాగే ఫిబ్రవరి 6 నుంచి 12 వరకు ఇండోర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో బి.హారిక(బ్రాంజ్), సీహెచ్.లక్ష్మి(బంగారు) పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడల్లో కొండవెలగాడకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసించారు. వారికి నిరంతరం ప్రభుత్వం తరపున ప్రోత్సాహం ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కోచ్‌లు సీహెచ్.రాము, ఎం.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పుణ్యక్షేత్ర యాత్రలను సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ మేనేజర్ చంద్రమోహన్ బిశా తదితరులు

- ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ మేనేజర్

విజయనగరం టౌన్: భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రెన్ ఆధ్వర్యంలో పుణ్యక్షేత్ర యాత్ర పేరుతో పూరీ-కాశీ-అయోధ్యలో పలు దర్శనీయ ప్రాంతాలను సందర్శించేందుకు ప్రయాణికులకు ప్రత్యేక రైలు ఏర్పాటుచేసినట్లు ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ మేనేజర్ చంద్రమోహన్ బిశా తెలిపారు. ఈ మేరకు గురువారం రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి ప్రారంభమయ్యే రైలు విజయనగరం మీదుగా పూరీ, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ తదితర ప్రాంతాల్లో ఉన్న పుణ్యక్షేత్రాలకు భక్తులను క్షేమంగా తీసుకువెళ్లి, వారికి అవసరమయ్యే అన్ని రకాల వసతి, భోజనం, ప్రయాణ సదుపాయాలను ఐఆర్‌సీటీసీయే భరిస్తుందన్నారు. స్లీపర్, 2ఏసీ, థర్డ్ ఏసీ టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మార్చి 18 నుంచి 25 వరకూ ఏడురాత్రులు, ఎనిమిది రోజుల పాటు యాత్ర ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్ 8287932318, 9701085461 నంబర్లను కానీ విశాఖపట్టణంలో ఉన్న ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో గానీ సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీజీ.ప్రసాదరావు, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ జె.శ్రీనివాస.రావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు

- ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు


విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల మెడికోలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స కోసం వచ్చిన వారికి ఒక్క పైసా ఖర్చు కాకూడదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. రోగులకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఓపీ సేవలు కూడా ఉచితంగా అందించాలని చెప్పారు. ఏ నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఏఏ రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయో ఆస్పత్రిలో ప్రదర్శించాలని కోరారు. సమావేశంలో టీమ్ లీడర్లు తుంపల్లి జనార్దనరావు, రాయవరపు మత్స్యాలనాయుడు, భాను, ఉమ, దేవిలు పాల్గొన్నారు.

కొరమలో మహిళ మృత అవశేషాలు

- సంఘటన స్థలంలో పుర్రె, ఎముకలు, చీర గుర్తింపు
- హత్య చేసి పడవేసినట్లు అనుమానం



మృతురాలి అవశేషాలు గుర్తిస్తున్న తహసీల్దార్ అప్పారావు, ఎస్సై అమ్మాన్‌రావులు



మృతురాలి పుర్రె,ఎముకలు

భామిని: మండలంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం అవశేషాలు బయటపడడంతో భయాందోళనలు నెలకొన్నాయి. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం కొరమ సమీపంలోని వంశధార కాలువ సమీపంలో మహిళ మృతదేహం ఆనవాళ్లు గురువారం కనిపించాయి. ఎక్కడో హత్య చేసి తీసుకువచ్చి స్థానికంగా పారవేసినట్లు భావిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో బత్తిలి ఎస్సై వై.అమ్మాన్‌రావు, భామిని తహసీల్దార్ నీలాపు అప్పారావులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించి మహిళ మృతదేహం ఆనవాళ్లుగా నిర్ధారించారు. ఆమెకు సుమారు 30 ఏళ్లు ఉండొచ్చని అంచనా వేశారు. మృతురాలి పుర్రె, ఎముకలు, తల జుత్తు, గాజులు,చీర, లంగా వేర్వేరుగా పడి ఉండడాన్ని గుర్తించి అనవాళ్లు సేకరించారు. సుమారు రెండు నెలల క్రితం మరణించినట్లు పోలీసులు అంచనా వేశారు. కానీ బత్తిలి పోలీస్‌స్టేషన్‌లో మహిళ మిస్సింగ్ కేసు నమోదు కాలేదని ఎస్సై వై.అమ్మాన్ రావు తెలిపారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

కొత్తూరు వివాహితగా అనుమానాలు

భామిని మండలం కొరమ సమీపంలో గుర్తించిన మహిళా మృతదేహం ఆనవాళ్లను బట్టి మృతురాలు శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలానికి చెందిన వివాహితగా ప్రచారం జరుగుతోంది. గత నెల 1వతేదీన భామిని మండలం వచ్చిన వివాహిత అదృశ్యమైనట్లు కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. కొరమ వద్ద గుర్తించిన మృతురాలి దుస్తులను చూసిన సమీప బంధువులు అదృశ్యమైన వివాహిత ధరించిన చీరగా చెబుతున్నారు. పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తే నిజాలు బయట పడతాయని మృతురాలి సమీప బంధువులు భావిస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹ 160

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో గురువారం నలుగురు మృతి చెందగా మరో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన ఆయా ప్రమాదాల వివరాలిలా ఉన్నాయి.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వెంకటరావు

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామానికి చెందిన పిల్లా వెంకటరావు(50) గ్రామంలో విద్యుత్ షాక్‌తో తగలడంతో గురువారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన తన మేనల్లుడు ఏడువాక అచ్చంనాయుడుకు చెందిన విద్యుత్ మోటార్‌ను మరమ్మత్తు చేస్తున్న సమయంలో వెంకటరావు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో గ్రామస్తులు హుటాహుటిన ట్రాక్టర్‌పై శృంగవరపుకోట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి చేరే సమయానికే వెంకటరావు మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు వెంకటరావు తల్లి బుచ్చమ్మ గ్రామంలో ఉంటుండగా, భార్య రమణమ్మ, కుమారులు కోటరావు, సతీష్‌లతో కలిసి వెంకటరావు విశాఖలో నివాసం ఉంటున్నాడు. తన అక్క-బావలు అచ్చియ్యమ్మ-అప్పారావుల కొడుకు ఇంటి నిర్మాణ పనుల్లో సాయం చేసేందుకు వచ్చిన వెంకటరావు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఫిర్యాదు మేరకు ఎస్.కోట ఎస్సై లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి..



మృతి చెందిన గీత కార్మికుడు అడివయ్య

గజపతినగరం రూరల్: మండలంలోని గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముంత అడివయ్య(41) తాటిచెట్టు పైనుంచి జారిపడి మృతి చెందినట్లు గజపతినగరం ఎస్సై గంగరాజు గురువారం తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ అడివయ్య కల్లు గీత కార్మికుడని, కల్లు గీసేందుకు తాటిచెట్టుపైకి ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడి గాయాలపాలవడంతో స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు చెప్పారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

పాలకొండ రూరల్: మండలంలోని తుంపటాపల్లి సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో గాయపడిన నలుగురిలో బలగ పోలయ్య(50) శ్రీకాకుళం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతునికి భార్య గున్నమ్మతోపాటు ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో పోలయ్య బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. దీనిపై ఎస్సై బి.శివప్రసాద్ గురువారం కేసు నమోదు చేశారు.

లగేజీ ఆటోపై నుంచి జారిపడి మహిళ..



మృతురాలు దానమ్మ

పూసపాటిరేగ: మండలంలోని పతివాడబర్రిపేట సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపై లగేజీ ఆటోపై నుంచి జారి పడి గురువారం ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పతివాడబర్రిపేటకు చెందిన ముగ్గురు మహిళలు గ్రామం నుంచి వెళ్తున్న లగేజీ ఆటోపై ఉన్న ఐస్‌బాక్సులపై ఎక్కి ప్రయాణం చేస్తుండగా చినపతివాడ సమీపంలో మలుపు వద్ద ఆటోనుంచి కిందకు జారి పడిపోయారు. దీంతో వాసుపల్లి దానమ్మ (50) మృతి చెందగా , మరో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. గాయపడిన మహిళలను విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.నరేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.